క్లుప్తంగా

బలవంతపు భూసేకరణ ఆపాలి



మాట్లాడుతున్న రామచంద్రుడు

నంద్యాల(న్యూటౌన్): నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం పారేడు గ్రామంలో మూడు కార్ల పంటలు పండే 8 వేల ఎకరాల భూమిని ఇండోసల్ కంపెనీకి అప్పగించేందుకు బలవంతంగా రైతుల నుంచి భూసేకరణ చేయడం ఆపాలని సీపీఎం నంద్యాల జిల్లా కార్యవర్గ సభ్యులు రామచంద్రుడు, బాలవెంకట్ డిమాండ్ చేశారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ భూ నిర్వాసితులకు అండగా నిలిచిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావును అరెస్ట్ చేయడం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించుకునే భూమిని బలవంతంగా లాక్కొని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

లయన్స్‌క్లబ్ 316జే కో ఆర్డినేటర్‌గా పెసలశ్రీకాంత్



లయన్స్ క్లబ్ జిల్లా కో ఆర్డినేటర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న పెసల శ్రీకాంత్

నంద్యాల(వ్యవసాయం): లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ జిల్లా 316జే కో ఆర్డినేటర్‌గా పెసల శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల ప్రగతి సేవా క్లబ్‌లో విశిష్ట సేవలందించి నందుకు గాను పదవీ రావడం జరిగిందన్నారు. అనంతపురం, కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాల లయన్స్ క్లబ్‌కు ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కోఆర్డినేటర్‌గా ఆదివారం కసాపురం వాసవీ కల్యాణ మండపంలో ప్రమాణ స్వీకారం చేసినట్లు వెల్లడించారు. నమ్మకం ఉంచి పెద్ద బాధ్యత అప్పగించినందుకు క్లబ్స్ అభివృద్ధికి పాటుపడతానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో గవర్నర్ ఇల్లూరి గోపాలకృష్ణ, విజయ్ కుమార్ రాజు, పర్వతనేని సుభాష్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మా భూమి ఏమైంది



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్.పాంపల్లె రైతు

ఉయ్యాలవాడ: 108-1 సర్వే నంబరులో తనకు 3.25 ఎకరాలు భూమి ఉందని, అయితే, ఆన్‌లైన్‌లో చూపించడం లేదని ఆర్.పాంపల్లె గ్రామానికి చెందిన రైతు బాలగురప్ప ఆందోళన వ్యక్తం చేస్తూ సోమవారం పీజీఆర్‌ఎస్‌లో తహసీల్దార్ సువర్ణాదేవిని కలిసి విన్నవించారు. మండలకేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు భూ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వర రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కిందపడి వ్యక్తి మృతి

గోస్పాడు: యాల్లూరు గ్రామానికి చెందిన ప్రసాద్ (55) అనే వ్యక్తి ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. మద్యం మత్తులో ఉన్న ఈయన ఊరిలో బురదమయంగా ఉన్న రోడ్డుపై జారి కిందపడ్డాడు. ఈ ఘటనలో పరిబీజాలకు గాయం కావడంతో చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా కోలుకోలేక మృతి చెందాడు. ఈ మేరకు భార్య అన్నమ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మల్లన్నకు నృత్యార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై కడపకు చెందిన నటరాజ డ్యాన్స్ అకాడమి వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గణనాదం, మూషికవాహన, శివతాండవం, ఓం నమఃశివాయా, అమ్మాపరమేశ్వరి, అఖిలాండేశ్వరి తదితర గీతాలకు జయశ్రీ, ప్రతిభ, హిమబిందు, అనిత, శరణ్య, హేమవిర్షక, బద్రినాథ్, క్రాంతికుమార్ తదితరులు నృత్యం ప్రదర్శించారు.

శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్ర దీపార్చన సేవ నిర్వహించింది. ముందుగా దేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. ఈ సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.



చాగలమర్రిలో కుండపోతగా కురుస్తున్న వర్షం



ఆర్.జంబులదిన్నె నుంచి పెద్దముడియం దారిలో ప్రమాదకరంగా వంక దాటుతున్న గ్రామస్తులు



దొర్నిపాడు శివారులో మినుము పంటలో నిలిచిపోయిన వర్షం నీరు

వదలని వాన

- జలమయమైన పంటలు
- పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- కుందూనదికి భారీగా వరదనీరు విడుదల
- మొక్కజొన్న, మినుము, వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం
- ఆందోళనలో రైతన్నలు

ఉయ్యాలవాడ/చాగలమర్రి: అల్పపీడన ప్రభావంతో గత ఐదారు రోజుల నుంచి వర్షాలు వదలకుండా కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ఈవానలకు నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఇదే సమయంలో శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా అధికారులు కుందూనదికి 30 వేల క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. దీంతో వరద నీరు, వర్షపు నీరుతో పంట పొలాలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. ఫలితంగా వరి, మొక్కజొన్న, మినుము, పత్తి తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఉయ్యాలవాడ మండలంలో ఆర్.జంబులదిన్నె గ్రామం నుంచి వైఎస్‌ఆర్ జిల్లా పెద్దముడియం మండలానికి వెళ్లే రహదారులపై వంక ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉయ్యాలవాడ, దొర్నిపాడు తదితర మండల పరిధిలో కుందూనది తీరం వెంట ఉన్న గ్రామాల ప్రజలను రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. కుందూలో నీటి ఉధృతి తగ్గేంత వరకు బట్టలు శుభ్రం చేసుకునేందుకు రజకులు కూడా వెళ్లరాదని రెవెన్యూ అధికారులు గ్రామాల్లో టాంటాం వేయించారు.

- దొర్నిపాడు: గత రెండు రోజులుగా వర్షం విరామం లేకుండా కురుస్తుంది. దీంతో పనులు చేసుకునే కూలీలు, ఖరీఫ్ పంటలను సాగుచేసిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వరినాట్లు ముమ్మరంగా జరుగుతుండగా వర్షం కూలీలకు ఆటకంగా మారడంతో ఇళ్లవద్దనే ఉండాల్సి వస్తుంది. ఇక మినుము, కంది, మొక్కజొన్న సాగుచేసిన రైతుల పరిస్థితి చాలా అధ్వానంగా ఉంది. కోతకు వాతావరణం అనుకూలించక నీటి మడుగుల్లో కొట్టుమిట్టాడుతున్నారు.

- రుద్రవరం: మండలంలో మినుము రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంట చేతికొచ్చిన సమయంలో వానలు పడుతుండటంతో కోతలు నిలిచిపోయాయి. ఆదివారం 27.2 మి.మీ వర్షం కురవగా సోమవారం మరింత ఎక్కువగా వర్షం కురిసింది. దీంతో విద్యా సంస్థలకు ఉన్నతాధికారులు సెలవు ప్రకటించారు. రుద్రవరంలో ప్రతి సోమవారం సంత నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఆళ్లగడ్డ,శిరివెళ్ల తదితర గ్రామాల నుంచి వ్యాపారులు వివిధ రకాల వస్తు సామగ్రి, కూరగాయలతో దుకాణాలను ఏర్పాటు చేశారు. అయితే వర్షం వదలకుండా కురవడంతో మార్కెట్ అంతా చిత్తడిగా మారింది. వస్తువులు,కూరగాయలు కొనుగోలుకు వినియోగదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

చాగలమర్రిలో 19.2 మి.మీ వర్షపాతం

మండలంలో సోమవారం ఉదయం 19.2 మి.మీల వర్షపాతం నమోదైంది. వారం రోజులుగా కురుస్తున్న వానలకు ఓ వైపు పంటలు దెబ్బతినగా మరోవైపు పనులు, వ్యాపారాలు లేక వ్యవసాయ కూలీలు, చిరు వ్యాపారులు, ఆటో యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. చింతలచెరువు గ్రామంలో వరి పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. కలుగోట్లపల్లె సమీపంలో భవనాసి, పెద్ద భోదనం సమీపంలో వక్కిలేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రాజోలి ఆనకట్ట వద్ద కుందు నది ఉధృతంగా ప్రవహిస్తుంది.

ప్రమాదకరంగా తెలుగుగంగ కాల్వ కట్ట



రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరానికి సమీపంలో ఉన్న తెలుగుగంగ ప్రధాన కాల్వకట్ట బలహీన పడి ప్రమాదకరంగా మారింది. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి అధికారులు ఇదివరకే తెలుగుగంగ కాల్వకు నీరు విడుదల చేశారు. ఆ నీటికి గత కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షం నీరు తోడు కావడంతో కాల్వలో నీటి ప్రవాహ ఉధృతి అధికమైంది. దీంతో అక్కడక్కడ మట్టి కరిగి కట్ట బలహీన పడుతోంది. ఎప్పుడు కట్ట తెగి గండి పడుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. తెలుగు గంగ అధికారులు స్పందించి మరమ్మతుకు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రోజోలి ఆనకట్టు వద్ద వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ నది



చింతలచెరువు గ్రామంలో వర్షపు నీరు చేరడంతో నీట మునిగిన వరిపైరు



చాగలమర్రి..వర్షం రాకతో బాడుగలు లేక నిలిచిపోయిన ఆటోలు



చిత్తడిగా మారిన రుద్రవరం సంత మార్కెట్

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

గోస్పాడు: ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని నంద్యాల తాలూకా సీఐ ఈశ్వరయ్య విద్యార్థులకు సూచించారు. సోమవారం శాంతిరాం మెడికల్ కాలేజీలో విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ శాంతి రాముడు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మెలగాలన్నారు. సురక్షితమైన అనుకూల అభ్యాస వాతావరణాన్ని పెంపొందించడానికి యూజీసీ, ఎన్‌ఎంసీ చొరవతో ర్యాగింగ్ వ్యతిరేక వారాన్ని శాంతిరాం మెడికల్ కళాశాలలో స్ఫూర్తిదాయకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వసంత్ చావన్ మాట్లాడుతూ శాంతిరాం విద్యాసంస్థల్లో ర్యాగింగ్ పట్ల కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. అలాగే కళాశాలలో ర్యాగింగ్ సంఘటన జరిగితే విద్యార్థులు ధైర్యంగా కాలేజీలో డిస్‌ప్లే చేసిన నంబర్లకు కాల్ చేస్తే విచారణ జరుపుతామని వెల్లడించారు. అనంతరం యాంటీ ర్యాగింగ్ వీక్ ముగింపును పురస్కరించుకొని విద్యార్థులతో కళాశాలలో ర్యాగింగ్ వద్దు అంటూ భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్‌కాలేజీ సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శ్రీకాంత్, సర్జరీ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ - ఏఈ చీఫ్ వార్డెన్ డాక్టర్ శ్రీహరి, డిప్యూటీ హాస్టల్ వార్డెన్లు అంజలి వర్గీస, డాక్టర్ నవీన్ కుమార్, శ్రీదేవి, మైక్రోబయాలజీ ప్రొఫెసర్, సైకియాట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సిందూజ, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

అవయవదానంపై అవగాహన పెంచుకోవాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. జిల్లా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మొట్ట మొదట అవయదానం చేసిన బొప్పా సుజాత కుటుంబ సభ్యులకు రూ.50 వేలు నగదు పారితోషకం, ప్రశంసా పత్రాన్ని నంద్యాల కలెక్టరేట్లోని పీజీఆర్‌ఎస్ హాల్‌లో కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నంద్యాల మండలం గుంతనాల గ్రామానికి చెందిన బొప్పా సుజాత గోస్పాడు మండలం తేళ్లపూరి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించేదని, గత జూన్ నెల 1వ తేదీన ఆమె రోడ్డు ప్రమాదానికి గురైందన్నారు. బతికించడానికి డాక్టర్లు తీవ్రంగా ప్రయత్నించినా బ్రెయిన్ డెడ్ కావడంతో వీలుకాలేదన్నారు. దీంతో బాధిత మహిళ సోదరి డాక్టర్ విజయ, సోదరుడు సునీల్ కుటుంబ సభ్యులు అవయవ దానానికి ముందుకు రావడంతో ఏడుగురి జీవితాలలో వెలుగు వచ్చిందన్నారు. అవయవ దానం చేసిన బొప్పా సుజాత సోదరి డాక్టర్ విజయ మాట్లాడుతూ అవయవ దానంపై చాలామందికి అపోహలు ఉన్నాయని, మన కుటుంబ సభ్యులు ఎవరైనా చనిపోయినప్పుడు వారి అవయవాలు దానం చేయడం వల్ల తమ మనుషులు బతికి ఉన్నారన్న సంతృప్తి కలుగుతుందన్నారు. తన సోదరి అవయవాలు దానం చేయాలని నిర్ణయించుకున్నా, ఏ విధంగా ముందుకు వెళ్లాలో తోచలేదని, ఆ సమయంలో రెడ్ క్రాస్‌ను సంప్రదించామని చెప్పారు. కార్యక్రమంలో జేసీ విష్ణుచరణ్, డీఆర్‌ఓ రాము నాయక్, రెడ్ క్రాస్ మాజీ చైర్మన్ దస్తగిరి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సుజాత కుటుంబ సభ్యులకు నగదు పారితోషికం,ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ రాజకుమారి

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని నంద్యాల జిల్లా ఫ్యాప్టో చైర్మన్ శివయ్య, డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాసులు, మౌలాలి అన్నారు. వారం రోజుల్లో స్పందించకపోతే ధర్నాకు దిగుతామన్నారు. సోమవారం డీఆర్‌ఓ రామునాయక్‌ను కలిసి ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌ను రద్దు చేసి బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించాలన్నారు. పదవ తరగతి పరీక్షల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు పరీక్షా పత్రాల మూల్యాంకన రెమ్యూరేషన్‌ను తక్షణమే వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. అలాగే సమగ్రశిక్ష కార్యాలయాన్ని డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అజాంబేగ్, రామచంద్రారెడ్డి, సుబ్బన్న, అరవిందకుమార్, జానీబాషా, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేస్తున్న ఫ్యాప్టో సంఘం నాయకులు

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోండి

బొమ్మలసత్రం: నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని అనధికార లేఅవుట్లలో ఉన్న ప్లాట్లను క్రమబద్ధీకరించుకొని ప్రభుత్వం అందించిన సదావకాశాన్ని వినియోగించుకోవాలని కమిషనర్ శేషన్న కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో లైసెన్స్ టెక్నికల్ పర్సన్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకాన్ని గత నెల 26న ప్రవేశ పెట్టిందన్నారు. దీనిపై మున్సిపల్ ఎల్‌టీపీలు ప్రజలకు అవగాహన కల్పించి మున్సిపాల్టీ ఆర్థికాభివృదికి కృషి చేయాలన్నారు. అనధికార లేఅవుట్లలో ఉన్న ప్లాట్ల కొనుగోలు దారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.

గొలుసు చోరీ కేసులో అక్కాచెల్లెళ్ల అరెస్ట్

కర్నూలు (టౌన్): కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో హడావుడిగా బస్సు ఎక్కే ప్రయాణికుల వద్ద బంగారు గొలుసు, బ్యాగ్‌లను కొట్టేసే అక్కాచెల్లెళ్లను ఆదివారం రాత్రి నాల్గవ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సీఐ విక్రమసింహా వెల్లడించారు. ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 1 గంట సమయంలో జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్‌కు చెందిన పాగిడాల విమలమ్మ కర్నూలు బస్టాండ్‌లో ఆత్మకూరు బస్సు ఎక్కుతుండగా చేతి బ్యాగులో ఉన్న చిన్న పర్సు చోరీకి గురైంది. పర్సులో 4 తులాల బంగారు గొలుసు ఉండటంతో ఈ నెల 16న బాధితురాలు 4వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ విక్రమసింహా ఆధ్వర్యంలో ఎస్‌ఐ మోహన్ కిషోర్ రెడ్డి, మహిళా ఏఎస్‌ఐలు, క్రైం పార్టీ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈనెల 17న కొత్తబస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించి విచారించారు. వారు కర్నూలు వడ్డె గేరికి చెందిన షేక్ ఖాజాబీ, షేక్ ఫరీదా అనే అక్కాచెల్లెళ్లుగా తెలిసింది. బంగారు గొలుసును దొంగిలించినట్లు అంగీకరించారు. వారి వద్ద నుంచి గొలుసు స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచినట్లు సీఐ వెల్లడించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు బహిరంగ ప్రదేశాలు, బస్టాండ్, రైల్వేస్టేషన్లలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులను గమనిస్తే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ విజ్ఞప్తి చేశారు.



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

వృత్తి నైపుణ్యంతో పోటీ ప్రపంచలో రాణింపు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో నంది ఫౌండేషన్ సహకారంతో ఎంప్లాయ్‌బులిటీ స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రాంను ప్రారంభించారు. దీనిపై సోమవారం కళాశాల చైర్మన్ రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించేందుకు వృతి నైపుణ్యం చాలా అవసరమన్నారు. విద్యార్థులు పాఠ్యాంశాలతో సరిపెట్టుకోకుండా వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ స్కిల్స్, టీంవర్క్, సమస్య నైపుణ్యాలను అలవర్చుకోవాలన్నారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు భవిష్యత్తులో విద్యార్థులకు దారి చూపుతాయన్నారు. ఆరు రోజుల పాటు నంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఈవీఎస్ కుమార్, ప్రిన్సిపాల్ సుబ్బయ్య, అకాడమిక్ డీన్ ప్రగతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

పంచమఠాల్లో విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో లోక కల్యాణార్థం పంచమఠాలలో విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించారు. సోమవారం ఉదయం భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠాలలో పూజలు చేపట్టారు. ముందుగా అర్చకులు సంకల్పాన్ని పఠించారు. అనంతరం ఘంటామఠంలోని గణపతికి చేసి, అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాస రావు, ఏఈవో హరిదాసు, ఉపప్రధానార్చకులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఫిలాటెలీ స్కాలర్‌షిప్ పరీక్ష

కర్నూలు (అర్బన్): విద్యార్థులకు స్టాంపుల సేకరణపై అవగాహన కల్పించేందుకు పోస్టల్ శాఖ ఎన్నో రకాల కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అందులో భాగంగా 'దీన్ దయాళ్ స్పర్శ్ యోజన' (డీడీఎస్‌వై) అనే స్కాలర్‌షిప్ పరీక్షను సెప్టెంబర్ నెలలో నిర్వహించనున్నట్లు కర్నూలు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్ధర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 6వ తరగతి నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.6 వేలు స్కాలర్‌షిప్ అందించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల విద్యార్థులు వ్యక్తిగతంగా కానీ తమ స్కూల్ ప్రిన్సిపాల్ ద్వారా కానీ 'ఫిలాటెలీ డిపాజిట్ ఖాతా'ను రూ.200తో కర్నూలు ప్రధాన తపాలా కార్యాలయంలో తెరిచి ఆ వివరాలను అప్లికేషన్‌కు జతపరచి ఒక కవరులో సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, కర్నూలు డివిజన్, కర్నూలు 518001 అడ్రసుకు పంపాలని సూచించారు.

కాశీవిశ్వేశ్వర ఆలయ జీర్ణోద్ధరణ ప్రారంభం

మహానంది: మహానంది దేవస్థానానికి దత్తత దేవాలయమైన తమ్మడపల్లెలోని శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులు సోమవారం ప్రారంభించారు. ఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గ్రామపెద్దల సమక్షంలో పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. వేదపండితులు, అర్చకులు ముందుగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, అభిషేకం చేసి గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. కాశీవిశ్వేశ్వరస్వామి, ఆంజనేయ స్వామి వార్ల మూలమూర్తుల నుంచి కళాలను తీసి ప్రత్యేక కలశంలో కళావాహన నిర్వహించి బాలాలయం చేపట్టారు. పూజా కార్యక్రమంలో జెడ్పీటీసీ మహేశ్వర రెడ్డి, సర్పంచ్ ప్రతాప్ రెడ్డి, మాజీ చైర్మన్ కొమ్మా మహేశ్వర రెడ్డి, ఏఈఓ ఎరమల మధు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి, నాయకులు జనార్దన్ రెడ్డి, నాగేశ్వర రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

24న జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 24వ తేదీన గురురాజ పాఠశాల క్రీడా మైదానంలో జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ షేక్షావలిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలో ఉన్న గురురాజ పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు 02-01-2025 తర్వాత పుట్టి ఉండాలన్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులు సెప్టెంబర్ 12 నుంచి 14వరకు అనంతపురం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ క్రీడల్లో ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. మరింత సమాచారం కోసం సెల్: 9966707327 నంబరును సంప్రదించాలని బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి బాబు పేర్కొన్నారు.

అర్హులు దరఖాస్తు చేసుకోండి

చాగలమర్రి: అర్హత ఉండి అన్నదాత సుఖీభవ పథకం సాయం అదని రైతులు ఈ నెల 20వ తేది లోపు గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రంగనేతాజి సోమవారం విలేకరులకు తెలిపారు. ధ్రువీకరణ, పరిశీలనలో తిరస్కరణకు గురైన దరఖాస్తులు, ఈ కేవైసీ చేసుకోక తిరస్కరణకు గురైన రైతులు తమ వివరాలను రైతు సేవా కేంద్రాల్లో తెలియజేయాలన్నారు.